అంటూ కూర్చోబెట్టి టిఫిన్లూ గట్రా పెట్టి, కాఫీ గట్రా తాగించి గంటల తరబడి కాలం తెలీకుండా కబుర్లతో అలరిస్తారు.

ఆ సమయంలో బాపు, రమణల మీదా తన గురువు తమ్మా సత్యనారాయణ గారి మీద ఆయనకున్న భక్తి, శ్రద్ధలు గౌరవాభిమానాలూ మాటల్లో విధిగా చోటు చేసుకొంటాయి. నాలుగేళ్ల క్రితం అప్పటి 'నవ్య' వారపత్రిక సంపాదకులు ప్రోత్సాహ, సూచనల మేరకు మధ్య తరగతి పాత్రలతో 'మనమీదేనర్రోయ్' కార్టూన్లు ప్రారంభించి, నాలుగు ప్రధాన పాత్రలతో (గమ్మత్తు.. వాటికి పేర్లు లేవు) వారం వారం 'నవ్య' పాఠకుల్ని నవ్వుల్లో స్నానం చేయిస్తున్న సరసికి, మధ్యతరగతి మందహాసం మీద అపారమైన ప్రేమ! పెళ్లి, ప్రయాణం, సంగీతం, రంగస్థల నాటకాలు, ఇల్లు, గుడిలాంటి తెలిసిన అంశాలనే ఇతివృత్తాలుగా ఎంచుకొని, తనదైన వ్యంగ్య రేఖా విన్యాసాలతో, అక్షర రమ్యతతో పాఠకుల్ని సున్నితంగా చురకలు వేసి, ఒప్పించి, మెప్పించడంలో సరసి పాటిస్తున్న సమతౌల్యానికి హేట్సాఫ్. భమిడిపాటి కామేశ్వరరావు గారి 'నా మీదేనర్రోయ్'ని స్ఫూర్తిగా తీసుకొని 'మనమీదేనర్రోయ్'ని నాలుగేళ్లుగా పండిస్తున్న సరసికి హృదయపూర్వక శుభాకాంక్షలు.

**–ఓలేటి శ్రీనివాసభాను**



## నీకేటి కోలు!

మలచాలి నరమేన నిలిపి పేరెలమిమై
చలిగొండ చరులందు మెలగువాడ!
నెమ్మేని నిండ నేనికతోలు, మొలమీదు
పులితోలు హవనించి పొలయువాడ!
చలువగందము రోసి వెలి బూది మైపూసి
చెలువ పేరును మెడం గలుగువాడ!
జడలందు నినువాక ముడివైచి వలివెల్లు
పూవటు సిగమీద పూనువాడ!
సంకునొక చేత నొకచేత జింక
నొక్కకేలు ముమ్మొన వాలొక్క కేలడక్క
బొరసి యురళించి యాటాడు వేసకాడ
మేటి ఆటల రేడ నీకేటి కోలు!

**– కీ.శే.అనంతపంతుల రామలింగస్వామి**
(అచ్చతెలుగు పద్యం)

## 'సరసి' కత

వైశంపాయనుడి అరిచేతులకి, అరికాళ్లకి చెమటలు పట్టే జబ్బుంది. చిన్నప్పట్నించీ దానితో చాలా ఇబ్బందులు పడ్డాడతను. ఆఫీసులో ఎవరైనా ఎదురై 'హలో' అంటూ చెయ్యికలిపి, చిత్తడి చేయి తగలగానే 'ఛీ ఎందుక్కలిపేన్రా బాబూ' అని తిట్టుకునే వాళ్లు. దాంతో ఎవరు కనబడినా చేతులెత్తి నమస్కారం చెయ్యడం అలవాటు చేసుకున్నాడు వైశంపాయనుడు. అలా నమస్కారం చేసినప్పటికీ కొత్తవాళ్లు కొందరు తెలియక చేతులు ముందుకు చాచడం, కాదనలేని

# ఉప్పు దొంగ



స్థితిలో అతగాడు కలపడం, వాళ్లు లోపల తిట్టుకుని పోవడం జరుగుతూ వుండేది.

చాలామంది డాక్టర్లని, స్పెషలిస్టుల్నీ కలిసేడు వైశంపాయనుడు. 'ఏం లేదు, జనరల్ వీక్‌నెస్' అన్నారు వాళ్లు. ''ఏం దొబ్బిడాయ్, ముప్పొద్దులా తిని తిరుగుతున్నారుగా, ఇంకా వీక్ నెస్సేవిటీ?'' అనేది భార్య సుబ్బాయమ్మ గారు.

ఓసారి ఉత్తరాది నుంచి ఓ స్వామీజీ వచ్చారు వూళ్లోకి. ఆయన యోగవిద్యలోనూ, ఆయుర్వేద వైద్యంలోనూ పేరున్నవాడని తెలిసి, ఆయనకి చూపించింది సుబ్బాయమ్మ గారు. ఆయన వైశంపాయనుడి కేసి ఎగాదిగా చూసి, ''ప్రారబ్ధం'' అన్నాడు మెల్లగా. ''ఇది ఈ జన్మకి తగ్గదు. ఎందుకంటే పూర్వజన్మలో ఇతగాడు ఉప్పు దొంగతనం చేశాడమ్మా. అదిప్పుడు ఈ రూపకంగా అను భవిస్తున్నాడు'' అన్నారు స్వామీజీ.

''ఇంగితం వున్నవాడెవడన్నా డబ్బు దొంగతనం చేస్తాడు – నగలు దొంగతనం చేస్తాడు – ఉప్పు దొంగతనం చేస్తాట్టండీ ఎవడన్నా? మీకీ జన్మకి బుద్ధి రాదనుకునేదాన్ని. ఈ జన్మలోనే కాదు, గత జన్మలో కూడా మీకు బుద్ధి లేదన్న మాట!'' అంటూ పాత జన్మలో చేసిన వాటిని కూడా కలిపి జమిలిగా తిట్టిపోసింది సుబ్బాయమ్మ గారు.

వైశంపాయనుడి చేతులు చెమ్మగిల్లాయి!!

*